రుణమాఫీ కాలేదని రైతుల ధర్నా

అధికారుల తప్పిదం వల్లేనని ఆగ్రహం.. మహబూబాబాద్ జిల్లాలో నిరసన

నర్సింహులపేట, డిసెంబర్ 2 : రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట రైతు వేదిక వద్ద రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రూ.55 వేల నుంచి రూ.2లక్షల లోపు పంటరుణం ఉన్నా తమకు మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ, బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో తమ బ్యాంకు ఖాతాలకు ఇతరుల ఆధార్‌కార్డు నంబర్లు నమోదు చేయడంతో మొదటి విడతలో రుణమాఫీ కాలేదని, అధికారులకు దరఖాస్తు చేసినా ఫలితం లేకుండాపోయిందని వెల్లడించారు. వ్యవసాయ అధికారులు కావాలనే తమ సెల్ఫీ ఫొటోలు తీయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత ఉన్న రైతులకు రుణమాఫీ చేసేవరకు దీక్ష చేపడుతామని కేవీపీఎస్ జిల్లా నాయకుడు మండుల యాకూబ్ తెలిపారు. ఈ సందర్భంగా పెద్దనాగారం స్టేజీకి చెందిన కాంగ్రెస్ నాయకుడు, రైతు బొబ్బ అశోక్‌రెడ్డి ఏవో వినయ్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగాడు.

రైతు రుణమాఫీ ఎవరికైంది?

రాష్ట్రప్రభుత్వం నాలుగో విడత రుణమాఫీ చేసినట్టు ప్రకటించింది. ఈ క్రమంలో అందరికీ రుణమాఫీ జరిగినట్టు సీఎం రేవంత్ సహా మంత్రులు చెబుతున్నారు. అయితే చాలా మంది రైతులు మాత్రం తమకు రుణమాఫీ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. రూ. 2 లక్షలలోపు రుణం తీసుకున్నా తమకెందుకు కావడం లేదంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. సాంకేతిక కారణాలు చెబుతూ అధికారులు దాటవేస్తున్నా, అన్నదాతలు మాత్రం అయోమయంలో పడ్డారు. మూడు విడతల్లో పేరు రాని వారు నాలుగో విడత జాబితా కోసం ఎదురు చూశారు. అందులో అయినా తమ పేరు వస్తుందేమోనని ఎంతో ఆశతో ఉన్నారు. వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. తమకు మాఫీ ఎందుకు కాలేదో తెలియడం లేదంటూ పలువురు రైతులు 'నమస్తే తెలంగాణ'తో తమ మనోవేదనను ఇలా పంచుకున్నారు.

55వేల రుణమాఫీ కాలేదు

నా బ్యాంకు ఖాతాకు జాటోత్ రమేశ్ అనే అతడి ఆధార్ కార్డు నంబర్‌ను అధికారులు నమోదు చేశారు. 4 నెలల నుంచి పీఏసీఎస్, ఏవో ఆఫీస్ చుట్టూ తిరిగితే తప్పును సరిదిద్దేందుకు దరఖాస్తు చేయమన్నారు. ఇప్పటి వరకు అధికారులు నా ఖాతకు వేరే వ్యక్తి ఆధార్ నంబర్ తొలగించకపోవడంతో నా రూ.55 వేల రుణం మాఫీ కాలేదు. పేద రైతులకు అన్యాయం చేస్తే కుటుంబం ఉసురు తుగులుతుంది.

-జేరిపోతుల రమేశ్, కొమ్ములవంచ రైతు

80వేలు బ్యాంకుకు చెల్లించినా మాఫీ కాలేదు

దంతాలపల్లి మండలం ఏపీజీవీబీ బ్యాంకులో రూ. 2.70 లక్షలు అప్పు తీసుకున్నా. రూ.2లక్షలకుపైన ఉన్న రూ.80వేలు బ్యాంకులో చెల్లించి మూడు నెలలు అవుతున్నది. ఇప్పటి వరకు మాఫీ చేయలేదు. బ్యాంకులో కట్టిన 80 వేలు అప్పుగా తీసుకొచ్చిన. మిత్తి పెరుగుతున్నది.

- అజ్మీరా ఆశానాయక్, గోపతండా

రుణమాఫీ జరిగేదెప్పుడు?

బ్యాంక్ అధికారుల తప్పిదంతో రుణమాఫీ ఐత లేదు. పంట రుణం రూ.1.50 లక్షలు తీసుకున్న. యూనియన్ బ్యాంక్ అధికారులు పంట రుణం రెండు సార్లు తీసుకున్నట్టు నమోదు చేసిన్రు. దీంతో రుణమాఫీ కావడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంక్ అధికారులతోపాటు కలెక్టర్‌ను కలిసి చెప్పినా ఫలితం లేదు. అధికారులు చేసిన తప్పును సరిదిద్దాలని కోరితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ నమోదులో ఎడిట్ ప్రక్రియకు అనుమతి ఇవ్వలేదని అధికారులు తిప్పుతున్నరు.

- పేర్ల రాకేశ్, మనుగొండ, వరంగల్

55 వేల రుణం మాఫీ కాలేదు

ఊకల్ రైతు సహకార సంఘంలో రూ. 55 వేల పంట రుణం ఉంది. రెండు సార్లు మాఫీ ప్రకటించిన జాబితాల పేరు లేదు. సహకార సంఘం సీఈవో, వ్యవసాయ అధికారులను అడిగితే ఆన్‌లైన్‌లో చెక్ చేసి నీ బ్యాంకు ఖాతాకు మరో రైతు ఆధార్‌కార్డు నంబర్ లింక్ అయిందని చెప్పిన్రు. వచ్చే జాబితాలో మాఫీ అయితదన్నరు. ప్రభుత్వం రూ. రెండు లక్షల వరకు అందరికీ రుణమాఫీ చేశామని చెప్తున్నది కానీ నాకు రూ. 55 వేల మాఫీ రాలేదు.

-జర్ర శరత్‌కుమార్, రైతు, మచ్చాపురం, వరంగల్

1.8 లక్షలున్నా మాఫీ కాలేదు

పరకాలలోని డీసీసీ బ్యాంకులో నా కుటుంబానికి రూ.1.8లక్ష ల లోన్ ఉన్నది. నా పేరు మీద రూ. లక్షా పదివేలు, కొడుకు పేరుమీద రూ. 74వేల రుణం ఉన్నది. ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాలో నా పేరులో హెచ్ అనే అక్షరం తేడా ఉండగా, మా కొడుకు పేరు అనుదీప్ బదులు చిరుదీప్‌గా నమోదు కావడంతో రుణమాఫీ కాలేదు. రూ. సీఎం రేవంత్‌రెడ్డి ఏమో 2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేసినం అని అంటున్నడు.. నాకే మో రుణమాఫీ గాకపాయె.

- తాళ్లపల్లి సంధ్యారాణి, నర్సక్కపల్లి, నడికూడ, హనుమకొండ

రుణమాఫీలో అన్యాయం చేశారు!

2021లో శాయంపేట పీఏసీఎస్‌లో రూ.95వేలు రుణం తీసుకున్న. ఇప్పటి వరకు దీనిని రూ.1.42లక్షలు చేశారు. ఇందులో సీఈవో రూ.32వేలు అదనంగా కలిపి పెంచేశారు. కానీ నాకు రుణమాఫీ కాలేదు. నాభార్య స్వాతి పేర 2023 నవంబర్‌లో రూ.1.50 లక్షల రుణం తీసుకున్నాం. రూ.2లక్షల కన్నా ఎక్కువగా ఉన్న డబ్బులు కట్టాలని అధికారులను అడిగితే కట్టినా రుణమాఫీ జరగదు, ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. చాలా మంది భార్యాభర్తలు రూ.2లక్షల రుణం కోసం పైనున్న డబ్బులు చెల్లించారు. కానీ ఎవరికి రుణమాఫీ కాలేదు. రుణమాఫీ పూర్తయినట్టు సీఎం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది. ఇప్పటికైనా రూ.2లక్షల రుణమాఫీని భార్యాభర్తలకు వర్తింపజేయాలి.

- దాసి శ్రావణ్‌కుమార్, రైతు, గోవిందాపూర్, శాయంపేట, హనుమకొండ

అప్ప తెచ్చి కట్టినా కాలే..

ఐదెకరాల వ్యవసాయభూమి ఉంది. యూబీఐలో పంట పెట్టుబడి కోసం క్రాప్‌లోన్ రూ. రెండు లక్షలు తీసుకున్న. రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి చెప్పడంతో సంబురపడ్డ. మూడోవిడత రుణమాఫీ చేసేముందు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రెండు లక్షల లోపు క్రాప్‌లో న్ రుణాలుంటే మాఫీ చేస్తామని చెప్పడంతో అప్పు తెచ్చి కట్టిన. అయినా ఇప్పటి వరకు రుణమాఫీ కాలే. నా భార్య రాణి పేరిట రెండెకరాల వ్యవసాయ భూమి ఉం ది. పంట పెట్టుబడికి ఆమె రూ. 90వేలు క్రాప్‌లోన్ తీసుకుంది. ఆ 90వేలు కూడా మాఫీ కాలే. ఒకే రేషన్ కార్డుపై ఒకరిది మాత్రమే మాఫీ చేస్తామని అధికారులు అంటున్నరు. నా పేర ఉన్న 2లక్షలు మాఫీ కాకున్నా, భార్య పేరుతోఉన్న 90వేలు మా ఫీ కావాలే కదా. విజయోత్సవాల పేరిట కళాకారులు వచ్చి రుణమాఫీ అయిందని చెప్పుతున్నరు. నాకేమో కాకపాయే.

-మేకల రవి, రైతు, లక్ష్మీపూర్, హనుమకొండ

మంత్రి మాటలు నమ్మి 20 వేలు బ్యాంకులో కట్టిన

బ్యాంక్ ఆఫ్ బరోడా ఐనవోలు బ్రాంచిలో 2024 జనవరిలో నా పేరు మీద రూ. 99 వేలు, భార్య స్వరూప పేరు మీద రూ.95 వేల రుణం తీసుకున్న. ఇద్దరిదీ కలుపుకొని రూ. లక్షా 94 వేల రుణం ఉంది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాటలు నమ్మి బ్యాంక్‌లో రూ. 20 వేలు జమ చేసిన. అయినప్పటికీ లోన్ మాఫీ కాలేదు. మంత్రి నాగేశ్వర్‌రావు రూ. 2 లక్షల లోపు రుణమాఫీ చేస్తాం. రూ.2 లక్షల కంటే ఎక్కువ ఉన్న అమౌంట్‌ను బ్యాంక్‌లో జమ చేయాలని చెప్పడంతో మా ఇద్దరి పేర్ల మీద రూ.20 వేల బ్యాంక్‌లో జమ చేశాం. అయినా రుణమాఫీ కాలేదు.

- పెంతల రవి, రైతు, ఒంటిమామిడిపల్లి, హనుమకొండ

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసింది

మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసింది. నాకు 3ఎకరాల భూమి ఉంది. బ్యాంకులో రూ.1.42 లక్షల రుణం ఉండగా మూడో విడతలో రుణమాఫీ కాలేదు. వ్యవసాయాధికారులు విచారణ చేసి రేషన్ కార్డులో పేరు లేకపోవడం వల్ల రుణమాఫీ కాలేదన్నరు. మా కుటుంబంలో నా ఒక్కడి పేరు మీదనే వ్యవసాయ భూమి, క్రాప్ లోన్ ఉంది. వ్యవసాయాధికారులు కుటుంబ వివరాలు సేకరించి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసుకుని కుటుంబంలో ఒకరికి మాత్రమే అప్పు ఉందని నిర్ధారించి వివరాలను నమోదు చేసుకున్నారు. 4వ విడతలో కూడా రుణమాఫీ కాలేదు.

- మేకల యాదగిరి రైతు, నారాయణగిరి, ధర్మసాగర్, హనుమకొండ

మాకు రుణమాఫీ ఎప్పడైతది

నేను యూనియన్ బ్యాంకు ఊకల్ బ్రాంచిలో పంట రుణం తీసుకున్న. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు తీసుకున్న రూ. 2లక్షల లోపు రుణాలను మాఫీ చేస్తామని చెప్పింది. నేను, నా భార్య పేరుమీద ఉన్న 2లక్షల పైన ఉన్న రూ. లక్షా 36వేలను అప్పులు తీసుకొచ్చి ఆగస్టులోనే బ్యాంకులో రుణం కట్టినం. ఇప్పటి వరకూ రుణమాఫి కాలేదు. ముఖ్యమంత్రి, మంత్రులేమో రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేశామంటున్నరు. రుణమాఫీ కాలేదు, రైతుభరోసా లేదు.. దీంతో మరింత అప్పుల పాలయ్యాం. కేసీఆర్ ప్రభుత్వంలో రైతుబంధుతో పంటల సాగుకు డబ్బులు సమయానికి సక్కగొచ్చేవి.

- కొనకటి మొగిలి, రైతు, మొండ్రాయి, సంగెం, వరంగల్

కాంగ్రెసోళ్లు మాట మార్చిన్రు

మాకున్న భూమి మీద కొంచవెల్లి గ్రామీణ బ్యాంక్‌లో నా పేరున రూ.1.60 లక్షలు, భార్య పేరున రూ.లక్ష రుణం తీసుకున్నం. ఇద్దరికీ కలిపి రూ. 2 లక్షలు రుణమాఫీ చేసి మిగతా రూ. 60 వేలు కట్టమంటే కట్టేటోళ్లం. ఇప్పుడు రూపాయి కూడా మాఫీ కాకపాయె. ఎన్నికలప్పుడు అందరికీ రుణాలు మాఫీ చేస్తామన్న కాంగ్రెసోళ్లు అధికారంలోకి రాగానే మాట మార్చిన్రు.

- ఇస్లావత్ గోపాల్, కల్వాడ, ఆసిఫాబాద్ జిల్లా

1.68 లక్షలు మాఫీ కాలేదు..

అన్నపురెడ్డిపల్లి ఏపీజీవీబీలో ఉన్న రూ 1.68 లక్షల పంట రుణం మాఫీ కాలేదు. రూ.2 లక్షల లోపు రుణమాఫీ జాబితాలో పేరు లేదు. మొదటి విడతలో రుణమాఫీ కాలేదని అధికారులను అడిగితే.. నీ భార్య, నీ పేరు కలిసి రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్నందున మాఫీ కాలేదని చెప్పారు. భార్య పేరుతో ఉన్న పంట రుణం మొత్తాన్ని మార్చిలోనే చెల్లించానని చెప్పగా బ్యాంకు నుంచి నోడ్యూ సర్టిఫికెట్ తెచ్చుకొని మరోసారి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మళ్లీ రుణమాఫీ కోసం దరఖాస్తు చేసుకున్నా మాఫీ రాలేదు. ఇప్పుడు వ్యవసాయ, బ్యాంకు అధికారులను అడిగితే.. జాబితా పంపించామని చెప్పారు. రుణమాఫీ వర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

-పలగాని పుల్లయ్య, రైతు, బుచ్చన్నగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

లక్షన్నరలోపు మాఫీకాలేదు..

ఏదులాపురం సొసైటీలో పంటరుణం తీసుకున్నా. అసలు వడ్డీ కలిపి రూ.1.50 లక్షలు అయ్యిందని సొసైటీ వాళ్లు చెప్పారు. పేరు కూడా పైకి పంపామన్నారు. కానీ ఇంతవరకు మాఫీ కాలేదు. రెండు నెలలుగా తిరుగుతున్నా. నాలుగో విడత వచ్చిందంటే మళ్లీ వచ్చాను. దీంట్లో కూడాపేరు లేదు. నాతోపాటు రుణాలు తీసుకొని నాకంటే ఎక్కువగా వడ్డీ అయినోళ్లకు మాఫీ వచ్చింది. ఎవరిని అడగాలో తెలియడం లేదు.

-బోజెడ్ల కృష్ణయ్య, రైతు, మంగళగూడెం, ఖమ్మంరూరల్ మండల, ఖమ్మం జిల్లా

బ్యాంకు చుట్టూ తిరిగినా వేస్ట్

నాకున్న ఏడెకరాల పట్టా భూమిపై రవీంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ. లక్షా 60 వేల క్రాప్ లోన్ తీసుకున్న. నాలుగు విడతల్లో రుణమాఫీ చేసినా ఏ లిస్టులోనూ నా పేరు రాలేదు. బ్యాంకుకు వెళ్లి అడిగినప్పుడల్లా వస్తదని చెప్పి పంపిన్రు. ఇప్పుడేమో అందరికీ రుణమాఫీ చేసినమంటున్నరు. ప్రాణహిత బ్యాంక్ వాటర్‌లో పంటలు మునిగితే ఇప్పటి వరకు అధికారులు సర్వే చేసింది లేదు.

- రౌతు శంకర్, గూడెం, ఆసిఫాబాద్ జిల్లా

4 విడతలుగా మాఫీ కాలే..

నారాయణపేట యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.1.60 లక్షల పంట రుణం తీసుకున్న. రెగ్యులర్‌గా రెన్యువల్ చేశాను. బ్యాంకు, వ్యవసాయ శాఖ అధికారులు ఆధార్ కార్డులో బాలు నాయక్ చవాన్‌గా ఉంది. బ్యాంకు ఖాతాలో లంబాడీ బాలుగా ఉంది. దీంతో రుణమాఫీ కాలేదని, రెండు నెలల కిందట అధికారులు పేర్లు సరిచేసి రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. చిన్నప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ వీరాభిమానిని. నా కొడుకు బీఆర్ఎస్ నుంచి సర్పంచ్‌గా గెలుపొందినా, నేను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాను.

-బాలు నాయక్, రైతు, పిల్లిగుండ్ల తండా, నారాయణపేట జిల్లా

లోకం పోకడ

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
మహబూబ్‌నగర్	15.0°c	29.0°c
ఆదిలాబాద్	19.8°c	32.6°c
నల్లగొండ	20.0°c	29.0°c
మెదక్	20.4°c	31.8°c
నిజామాబాద్	22.1°c	32.9°c
రంగారెడ్డి	21.3°c	30.8°c
హైదరాబాద్	22.0°c	28.6°c
కరీంనగర్	22.0°c	28.0°c
వరంగల్	23.0°c	28.0°c
ఖమ్మం	23.0°c	28.0°c

నిన్న బదిలీవేటు.. నేడు కీలక పోస్టు

మొదటిపేజీ తరువాయి...

కిందట డైరెక్టర్ టెక్నికల్‌కు అదనంగా మళ్లీ ప్రాజెక్టు డైరెక్టర్-1గా బాధ్యతలు అప్పగిస్తూ జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి అంతర్గత ఉత్తర్వులు జారీ చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిన వెంటనే హడావుడి చేసిన ప్రభుత్వం సుదర్శన్ సహా మరో నలుగురు అధికారులను సస్పెండ్ చేసింది. కాంట్రాక్ట్ సంస్థ మేఘా నుంచి సంజాయిషీ కోరింది. రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంతో ఉన్నతస్థాయి విచారణ అంటూ హంగామా చేసిన ప్రభుత్వం ఆ తర్వాత ఆ విషయాన్ని అటకెక్కించింది. ఇప్పటి వరకు మేఘాపై ఎలాంటి చర్యలు లేవు. అంతేకాదు, సుదర్శన్‌ను ప్రాధాన్యం లేని పోస్టు నుంచి తిరిగి కీలక పోస్టులు ఇప్పించేలా తెరవెనక 'మెగా' ఒత్తిడి పనిచేసినట్టు తెలిసింది. అకస్మాత్తుగా ఆయన కీలక పదవిలోకి మళ్లీ రావడంపై అధికార వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతున్నది. అమృత్-2 పథకంలో భాగంగా రూ. 3,848 కోట్ల వ్యయంతో 972 ఎంఎల్‌డీల సామర్థ్యంతో 39 ఎస్టీపీలకు జలమండలి టెండర్లు పిలవగా, కొందరికి లబ్ధి చేకూర్చేందుకే ఈ ఉన్నతాధికారిని తిరిగి తీసుకువచ్చారా? అన్న చర్చ బోర్డులో జోరుగా నడుస్తున్నది. సుంకిశాల ఘటనలో గోప్యత పాటించడంతో పాటు ప్రాజెక్టు డైరెక్టర్‌గా కీలకమైన స్థానంలోని ఉన్నతాధికారిదే పూర్తి బాధ్యత ఉన్నందున ప్రభుత్వం ఆయన విషయంలో కఠినంగా వ్యవహరించాలి. కానీ సదరు ఉన్నతాధికారికే రెండు కీలక పోస్టులతో పట్టం కట్టి, మిగతా నలుగురు ఇంజినీర్లను మాత్రం ఇంకా శిక్షించడం ఎంతవరకు సమంజసమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాయుగుండంగా 'ఫెంగల్'

- 8వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తేతెలంగాణ): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ పుదుచ్చేరి వద్ద బలహీనపడి వాయుగుండంగా మారిందని వాతావరణశాఖ ప్రకటించింది. మంగళవారం అరేబియన్ సముద్రంలో ప్రవేశించే అవకాశం ఉన్నట్టు పేర్కొంది. దీని ప్రభావంతో ఈనెల 8వతేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో చలితీవ్రత తగ్గింది. రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. ఉదయం వేళల్లో పొగమంచు కమ్ముకుంది.

మరో రైతు ఆత్మహత్య

- ఆదిలాబాద్ జిల్లాల్లో ఘటన

ఇచ్చోడ, డిసెంబర్ 2: సాగులో ఆశించిన మేర దిగుబడులు రాకపోవడం, అప్పులు భారంగా మారడంతో ఆదిలాబాద్ జిల్లాలో ఓ రైతు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలం జున్ని గ్రామానికి చెందిన దొంగ్రీ జ్ఞానేశ్వర్ (43)కు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. పత్తి సాగు కోసం అప్పు చేశాడు. ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. సోమవారం పొలానికి వెళ్లాడు. అక్కడే చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తిరుపతి తెలిపారు.

అసెంబ్లీ ముట్టడికి పాడి రైతులు సై!

- పాల బిల్లులు రాకపోవడంపై ఆగ్రహం

హైదరాబాద్, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ): ప్రభుత్వం పాల బిల్లులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ పాడి రైతులు పోరుబాటకు సిద్ధమవుతున్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టే అంశంపై పాడి రైతు సంఘాలు చర్చిస్తున్నట్టు సమాచారం. బకాయిల విడుదలపై ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో అసెంబ్లీ లేదా సచివాలయాన్ని ముట్టడించే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. సుమారు రూ.100 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది.

బోనస్ మెసేజ్ వచ్చింది.. పైసల్ రాలే!

కరీంనగర్ కలెక్టరేట్, డిసెంబర్ 2: వానకాలం సీజన్‌లో సన్నవడ్లకు సంబంధించిన బోనస్ విడుదల చేసినట్టు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్లతో తన ఫోన్‌కు మెసేజ్ వచ్చినా ఖాతాలో మాత్రం డబ్బులు జమకాలేదని మానకొండూర్ మండలం కొండపల్కలకు చెందిన యాట వెంకటరెడ్డి అనే యువరైతు 'ప్రజావాణి'లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 65 క్వింటాళ్లకుపైగా సన్నాలు పండిస్తే, రూ.32,600 బోనస్‌గా డీసీబీబీలో జమచేసినట్టు వారం క్రితం మెసేజ్ వచ్చినట్టు పేర్కొన్నారు. బ్యాంకుకు వెళ్తే డబ్బులు రాలేదని, పౌరసరఫరాల శాఖ అధికారులను కలవాలని పంపినట్టు తెలిపారు. సదరు అధికారుల వద్దకు వెళ్తే ఖాతాలో జమ చేశామని చెప్పారని, దీనిపై లిఖిత పూర్వకంగా సమాధానమివ్వాలని కోరితే పట్టించుకోవడం లేదని, తనకు న్యాయం చేయాలంటూ కలెక్టర్‌ను వేడుకున్నారు.

రుణమాఫీ వంద శాతం పూర్తి: తుమ్మల

ఖమ్మం, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా రాష్ట్రంలోని రైతులకు రుణమాఫీని వంద శాతం పూర్తి చేశామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రుణమాఫీ నిమిత్తం మొత్తం రూ.20 వేల కోట్లను 25 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు పేర్కొన్నారు. సోమవారం ఆయన ఖమ్మంలో మీడియాతో మాట్లాడారు. రూ.2 లక్షల రుణం కలిగిన రైతులందరికీ వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశామని తెలిపారు. రాష్ట్రంలో భూములు ఉండి.. విదేశాల్లో ఉన్న వారి ఆధార్ కార్డులను సైతం సేకరించి బ్యాంకులకు లింక్ చేసి రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేసినట్టు చెప్పారు. రూ.2 లక్షల రుణం తీసుకున్న రైతులు రాష్ట్రంలో ఒక్కరు కూడా లేరని తెలిపారు.

దళిత రైతుకు సర్కారు దగా

- కర్షకుడిని సర్కారు ఉద్యోగిగా చూపి మోసం
- రూ.1.92 లక్షల రుణమాఫీ ఎగ్గొట్టిన రేవంత్ ప్రభుత్వం
- నిజామాబాద్ కలెక్టర్ ఆదేశాలిచ్చినా అమలు కాని వైనం
- వంద శాతం రుణమాఫీ అంటూ రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు
- ఉద్యోగమా.. రుణమాఫీ? ఏదో ఒకటి ఇవ్వాలంటున్న రైతు



I. రైతు వివరములు :

రైతు పేరు (శ్రీ/శ్రీమతి)	RODDA SUMAN	తండ్రి/భర్త పేరు (శ్రీ/శ్రీమతి)	RAJANNA
జిల్లా	Nizamabad	చిరునామా	1-10 MADHAPUR, MAKLOOR Nizamabad
ఆధార్ సంఖ్య	xxxx-xxxx-6192	సెల్ నెం.	9491535143
ఫ్యామిలీ ఐడి	3460-774	కుటుంబంలో ఉన్న రుణఖాతాల సంఖ్య	2

II. కుటుంబం యొక్క రుణ వివరములు :

క్రమ సంఖ్య	రైతు పేరు (శ్రీ/శ్రీమతి)	ఆధార్ సంఖ్య	బ్యాంకు వివరములు	రుణ ఖాతా నెం.	08.12.2023 నాటికి రుణబకాయిలు మొత్తం (రూ)	రుణమాఫీ అర్హత (రూ)	రుణమాఫీ స్థితి
1	2	3	4	5	6	7	8
1	RODDA SUMAN Male	xxxx-xxxx-6192	STATE BANK OF INDIA MAKLOOR SBIN0021653	40945002416 Crop Loan	165220		కుటుంబం లో మినహాయింపు లేని ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారు.
2	Rodda Suman Male	xxxx-xxxx-6192	DCCB NIZAMABAD Makloor TSAB0018039	362000230900007 8 Crop Loan	26801		కుటుంబం లో మినహాయింపు లేని ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారు.
					192021		

కుటుంబంలో మినహాయింపులేని ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారని పేర్కొంటూ రొడ్డ సుమన్‌కు రుణమాఫీ కాలేదని వెబ్‌సైట్‌లో పేర్కొన్న ప్రభుత్వం

నిజామాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతులందరికీ రూ.2లక్షల్లోపు రుణమాఫీ చేశామంటూ సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. రైతు సంబురాల్లో భాగంగా ఘనంగా ఈ విషయాన్ని ప్రకటించారు. సీఎం హోదాలో ఈ విషయం చెప్పినప్పటికీ క్షేత్ర స్థాయిలో వాస్తవాలు మాత్రం మరోలా ఉన్నాయి. వ్యవసాయ శాఖ నిర్వాకం మూలంగా చాలా మందికి రుణమాఫీ కాలేదు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన దళిత రైతు రొడ్డ సుమన్ వ్యవహారమే ఉదాహరణ. నాలుగు ఎకరాలు సాగు చేసుకుంటున్న రైతు సుమన్‌ను ప్రభుత్వ ఉద్యోగిగా చూపించి రుణమాఫీ చేయకుండా ఎగ్గొట్టింది. ఈ విషయాన్ని గతంలోనే 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తీసుకొచ్చింది. ఆ సమయంలోనే వ్యవసాయ శాఖ కమిషనర్, నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పర్యవేక్షించి, బాధిత రైతుకు న్యాయం చేస్తామని చెప్పారు. నాలుగో విడతలోనూ మాఫీ చేయకుండా దళిత రైతును దగా చేసింది. సాంకేతిక తప్పిదంతో తనకు రావాల్సిన రుణమాఫీని ప్రభుత్వం ఎగ్గొట్టిందని సుమన్ వాపోతున్నాడు. తనను ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగం ఇస్తారా.. లేదంటే రుణమాఫీ చేస్తారా? తేల్చాలని డిమాండ్ చేస్తున్నాడు. సుమన్‌కు మాక్లూర్ ఎస్‌బీఐలో రూ.1,65,220, డీసీసీబీలో రూ.26,801 రుణం ఉంది. మొత్తం రూ.1,92,021 రుణాన్ని తీసుకోగా, వ్యవసాయ శాఖ జారీ చేసిన రైతు సమాచార పత్రంలో రుణమాఫీ స్థితి అని పేర్కొనే 8వ కా